# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో పర్యటిస్తారు.**
2. **రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో జంతు ప్రదర్శనశాలలు అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.**
3. **దేశంలో డెంగ్యూ వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేస్తోందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డా తెలిపారు.**
4. **హైదరాబాద్-విజయవాడ రహదారి విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**
5. **ఈరోజు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో పర్యటిస్తారు. తొలుత ఈ ఉదయం అనకాపల్లి జిల్లాలోని దార్లపూడి చేరుకుని పోలవరం ఎడమ కాలువను ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. అనంతరం విజయనగరం జిల్లాలో భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శిస్తారు. అక్కడ పనులు జరుగుతున్న తీరుపై అధికారులతో సమీక్షిస్తారు. తరువాత మెడ్ టెక్ జోన్‌లో జరిగే సీఐఐ కాన్ఫరెన్సులో వర్చువల్‌గా పాల్గొంటారు. అనంతరం మెడ్ టెక్ జోన్ కార్మికులతో సమావేశమవుతారు. సాయంకాలం విశాఖపట్నం విమానాశ్రయంలో అధికారులతో సమావేశమై పలు ప్రాజెక్టుల స్థితిగతులపై సమీక్ష నిర్వహిస్తారు.

-------------------------

రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో జంతు ప్రదర్శన శాలల అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ఆయన నిన్న గుంటూరు జిల్లా మంగళగిరిలో జూ పార్క్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ..జూ పార్కులను పర్యావరణహిత కార్యక్రమాలతో పర్యటకులను మరింత ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. జంతు ప్రదర్శన శాలల అభివృద్ధికి పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య విధానంలో నిధులు సమకూర్చడం, అరుదైన ,ఆకర్షణీయంగా ఉండే జంతువులను దిగుమతి చేసుకోవడం వంటి అంశాల మీద దృష్టి సారించాలని ఆదేశించారు.

రాష్ట్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేద్దామని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

దేశంలో డెంగ్యూ వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేస్తోందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డా తెలిపారు. డెంగ్యూ నివారణా చర్యల సంసిద్ధతను అంచనా వేయడానికి అధికారులతో నిన్న దిల్లీలో నిర్వహించిన సమీక్ష అనంతరం ఆయన పాత్రికేయిలతో మాట్లాడుతూ డెంగ్యూ నియంత్రణ కోసం తమ మంత్రిత్వ శాఖ 24 గంటలూ పనిచేసే హెల్ప్‌లైన్‌ను ప్రారంభిస్తుందని, రాబోయే 4-5 రోజుల్లో అలాంటి హెల్ప్‌లైన్‌ను ప్రారంభించాలని రాష్ట్రాలను కోరినట్లు తెలియజేశారు. రాష్ట్రాలతో కలసి డెంగ్యూ చికిత్స వార్డులు, చికిత్సా సదుపాయాలు, ఔషధాలను సిద్ధం చేయాలని కేంద్ర ఆసుపత్రులను జె.పి.నడ్డా ఆదేశించారు.

---------------------------

హైదరాబాద్-విజయవాడ రహదారి విస్తరణ వెంటనే చేపట్టాలని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణంపై సచివాలయం నుండి ఆయన నిన్న అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ భూసేకరణ విషయంలో మానవీయ కోణంతో వ్యవహరించాలనీ, నిబంధనల ప్రకారం రైతులకు ఎక్కువ పరిహారం అందేలా చూడాలని సూచించారు. ఆర్మూర్-నాగ్పూర్ కారిడార్‌కు ప్రభుత్వ భూములను కేటాయించాలనీ, హైదరాబాద్-మన్నెగూడ పనులు త్వరగా ప్రారంభించాలనీ అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. కాగా.. హైదరాబాద్-విజయవాడ రహదారి విస్తరణ పనులు 2 నెలల్లో ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఉక్కు కర్మాగారంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై చర్చించి, కర్మాగారాన్ని పూర్తిస్థాయిలో సందర్శించేందుకు కేంద్ర పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ.కుమారస్వామి నిన్న సాయంకాలం విశాఖపట్నం చేరుకున్నారు. అంతకుముందు ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కూడా విశాఖ చేరుకున్నారు. విశాఖ పార్లమెంటు సభ్యులు శ్రీభరత్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పి. శ్రీనివాసరావు, ఉక్కు పరిశ్రమ సీఎండీ అతుల్ భట్, స్థానిక శాసన సభ్యులు తదితరులు కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం పలికారు. కేంద్రమంత్రి కుమారస్వామి ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ ఈరోజు ఉక్కు కర్మాగారాన్ని పూర్తిస్థాయిలో సందర్శించి, ఇక్కడి పరిస్థితులపై ఆరా తీస్తామని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో దాదాపు 70 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో చమురు శుద్ధి కర్మాగారం, పెట్రోకెమికల్ కారిడర్ ఏర్పాటుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయిడు తెలిపారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటిడ్ ఛైర్మన్, ఎండీ కృష్ణకుమార్ నేతృత్వంలోని ప్రతినిధులతో ఆయన నిన్న అమరావతి లో సమావేశమయ్యారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రి సామాజిక మాధ్యమంలో వివరించారు. దేశానికి తూర్పు తీరంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన పెట్రోకెమికల్ సామర్థ్యం ఉందనీ, ఈ ప్రాజెక్టు కోసం 5వేల ఎకరాల భూమి అవసరమవుతుందనీ తెలిపారు. 90 రోజుల్లో ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సంస్థ ప్రతినిధులను కోరామనీ, ఇబ్బంది లేని పద్ధతిలో ఆ సంస్థకు సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ చంద్రబాబు నాయిడు పేర్కొన్నారు.

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న జనాభా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో ఈరోజు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. జనాభా పెరుగుదల, తగ్గుదలకు సంబంధించిన అంశాలపై ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. 1987 జులై 11వ తేదీన జన్మించిన శిశువుతో ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకుంది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చింది. "ఎవరిని వదిలిపెట్టకుండా ప్రతీ ఒక్కరిని లెక్కించండి" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2050వ సంవత్సరం నాటికి ప్రపంచ జనాభా భారీగా పెరిగే అవకాశం ఉన్నందున తమ తమ దేశాల్లో ఆయా ప్రభుత్వాలు అందుకు అనుగుణంగా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఐక్యరాజ్యసమితి సూచిస్తోంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతాలలో గంజాయి మూలాలు లేకుండా నిర్మూలించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యరాణి సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఆమె నిన్న అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గంజాయి పంటకు బదులుగా...కాఫీ, మిరియాలు వంటి ప్రత్యామ్నాయ పంటలు పండించే రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి వినియోగం వలన కలిగే అనర్థాలను తెలియచేసే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గతంలో అమలైన అన్ని పథకాలను గిరిజనులకు అందజేస్తామని ఈ సందర్భంగా మంత్రి వివరించారు.

---------------------------

2024 సంవత్సరానికి జాతీయ గోపాల్ రత్న అవార్డుకు జూలై 15 వ తేదీ నుండి నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నామినేషన్ దాఖలుకు చివరి తేదీ. నేషనల్ అవార్డు పోర్టల్ ద్వారా నామినేషన్‌ను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. పాలు ఉత్పత్తి చేసే రైతులు, డెయిరీ కోఆపరేటివ్ సొసైటీలు, పాల సరఫరా కంపెనీలను, ప్రోత్సహించడానికి జాతీయ గోపాల్ రత్న అవార్డును ప్రతి సంవత్సరం నవంబర్ 26వ తేదీన నిర్వహించే జాతీయ పాల దినోత్సవం సందర్భంగా ప్రదానం చేస్తారు.

---------------------------

తెలంగాణా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రకటించిన 3 వేల 35 పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైందని, దరఖాస్తు చేసుకోవాలంటూ కొన్ని సామాజిక మాధ్యమాలలో వస్తున్న లింక్‌లు నకిలీవని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ .. వి.సి. సజ్జనార్ స్పష్టం చేశారు. ఉద్యోగార్థుల వివరాలను తీసుకొని కొందరు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆ లింక్‌లపై క్లిక్ చేసి వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని ఆయన సూచించారు.

---------------------------

ఆత్మవిశ్వాసాన్ని పెంచి మంచి ఆరోగ్యాన్ని అందించే..క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఆంధ్రప్రదేశ్ క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. వైయస్సార్ జిల్లా పులివెందులలో నిన్న "2వ హాకీ ఇండియా జూనియర్ పురుషుల, మహిళల సౌత్ జోన్ ఛాంపియన్ షిప్-2024" క్రీడాపోటీలను

ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని.. రాష్ట్రం నుండి ఎంతోమంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా గుర్తింపు పొందారని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వేటకు వెళ్లే 20వేల పడవలకు శాటిలైట్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెం నాయుడు వెల్లడించారు. విజయవాడలో నిన్న ఆయన మత్స్య శాఖ అధికారులతో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులకు 10 కోట్ల రూపాయల డీజిల్ సబ్సిడీ బకాయిలు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. మత్స్యకారులకు ఇచ్చే పరిహారం, లబ్ధిదారులపై రీ-సర్వే చేసి 20 రోజుల్లో నివేదిక ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

======================